క్లుప్తంగా

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి


ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న శివలక్ష్మి

పుల్లలచెరువు: పుట్టిన నాటి నుంచి ఆరేళ్ల చిన్నారులకు ఆధార్ తప్పని సరి చేస్తూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసిందని, ఈ నేపథ్యంలో అధికారులు గ్రామాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ అధికారి శివలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం ఉమ్మడివరంలో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ 21వ తేదీన తెల్లగట్ల, చాపలమడుగులో, 22న ముటుకుల, చాపలమడుగులో, 23న సింగపల్లి, సి.కొత్తపల్లిలో, 24వ తేదీన బీర్నేనిపల్లి, చెన్నంపల్లి గ్రామాల పరిధిలో ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న చిన్నారులు తప్పని సరిగా ఆధార్ నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు.

బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పుల్లలచెరువు: మండలంలోని నరజాముల తండా ఆటవీ ప్రాంతం పరిధిలో స్థానిక ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాలపై స్క్వాడ్ అధికారులతో కలిసి దాడి చేశారు. నాటుసారా తయారీకి ఉపయోగించే 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా తయారు చేయడం నేరమని, అలా ఎవరైనా చేస్తే తమ దృష్టికి తీసుకు రావాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.


ఒక వైపు విద్యుత్ స్తంభం, మరోవైపు బస్సు ఉండటంతో నిలిచిన ట్రాఫిక్


రోడ్డు ఇరుకుగా ఉండటంతో ట్రాక్టర్‌లోని గడ్డి రోడ్డుపై పడి నిలిచిన ట్రాఫిక్

గడ్డి బండి వస్తే గంట ఆగాల్సిందే!

- వదేళ్లయినా తొలగించని విద్యుత్ స్తంభాలు
- రోడ్లపైనే బైకులు, ఆటోలు, చిరువ్యాపారుల బండ్లు

కురిచేడు: వేసవి ఆరంభం కానుండటంతో పండించిన పంటతో పాటు పశువుల మేతను రైతులు ఇళ్లకు ట్రాక్టర్ల ద్వారా తెచ్చుకుంటున్నారు. కొందరు రైతులు పల్నాడు జిల్లాకు వెళ్లి పశుగ్రాసం కొనుగోలు చేసి ట్రాక్టర్లలో స్వగ్రామాలకు చేరవేసుకుంటున్నారు. కురిచేడు వచ్చిందంటే సెంటర్ దాటాలంటే కనీసం గంట సమయం పడుతోంది. పదేళ్ల క్రితం నూతన రోడ్డు నిర్మించే సమయంలో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చాల్సి ఉంది. కానీ నేటికీ ఆ విద్యుత్ స్తంభాలు రోడ్లపైనే ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్నాయి. వాటిని ఆసరా చేసుకుని కొందరు రోడ్లపైకి తమ వ్యాపారాలను విస్తరించారు. దీంతో పాటు రోడ్లపైనే చిరువ్యాపారుల బండ్లు, ఆటోలతో పాటు ద్విచక్ర వాహనాలు సైతం నిలిపి ఉంచుతున్నారు. ట్రాఫిక్ జామైన సమయంలో కూడా వాటిని పక్కకు తీయక పోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమైంది. ఎదురుగా వచ్చే వాహనాలకు సైడు ఇస్తే పక్కనున్న విద్యుత్ స్తంభాలు తగిలి ట్రాక్టర్‌లోని గడ్డి కిందపడి పోవడమే కాకండా విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు ఎగిసి పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ట్రాక్టర్ గడ్డి అగ్నికి ఆహుతయ్యే ప్రమాదం లేకపోలేదు. బస్టాండ్ సెంటర్‌కు రాకుండా గ్రామం వెలుపలగా వెళ్లే దారి లేకపోవడంతో అన్ని రకాల వాహనాలు ఇదే రోడ్డుపై నుంచి వెళ్లాల్సి ఉంది. ప్రధాన రోడ్డును ఆనుకుని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉండటంతో విద్యార్థులు, చిన్నారులు, మహిళలు అదే దారిన రాకపోకలు సాగించాలి. వ్యవసాయ కూలీలు, పశువులతో పాటు మండల కేంద్రానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు కూడా అదే రోడ్డుపై వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు, ప్రజాప్రతినిదులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారలు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించటం, వాటిని ఆసరా చేసుకోని రోడ్లపైకి విస్తరించిన వ్యాపారులను వెనక్కు జరపాలని, రోడ్డుపై వాహనాలు నిలపకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.


గడ్డి ట్రాక్టర్ రావడంతో నిలిచిన ట్రాఫిక్

కూలీలకు గిరాకీ


మిర్చి కోస్తున్న కూలీలు

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లో వేసిన మిరప పంటలు చేతికి వచ్చే సమయంలో కూలీలకు భలే గిరాకీ ఏర్పడింది. అన్ని గ్రామాల్లో రైతులు ఒకేసారి మిరప కోతలు ప్రారంభించడంతో కూలీ ధర రూ.400 నుంచి రూ.500 వరకూ పెరిగింది. రైతులు ఏం చెయ్యాలో తోచక మిరప పంటను అధిక కూలీ అయినా చెల్లించి మిరపకాయలు కోపిస్తున్నారు. ఎకరా మిరపకాయలు ఒక కోత తీయాలంటే ఖర్చు సుమారు రూ.35–40 వేలు అవుతుందని రైతులు చెప్తున్నారు. పెద్దన్నపాలెం, వెంకటాపురం, భూమనపల్లి, ఇండ్ల చెరువు, పోలేపల్లి, రామిరెడ్డిపల్లి, లక్ష్మీపురం, రుద్రసముద్రం, మంగినపూడి, బసిరెడ్డిపల్లి, పుల్లయిపల్లి, రామాపురం గ్రామాల్లో సుమారు 650 హెక్టార్లలో మిరప పంటపై రైతులు దృష్టి సారించారు. ఇతర మండలాల నుంచి కూలీలు ట్రాక్టర్‌లు, ఆటోల్లో వందల సంఖ్యలో వస్తున్నారు. కూలీ ధరలు పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు గుంటూరు మిర్చి యార్డులో ధర డీలా పడిపోయింది. గత ఏడాది సుమారు క్వింటా రూ.20 వేల నుంచి రూ.22 వేల వరకు పలికింది. నేడు రూ.13 వేల నుంచి రూ.14 వేలు మాత్రమే ధర ఉంది. ఈ ఏడాది తెగుళ్ల బెడద, రేటు తగ్గడం రైతన్నలకు భారంగానే ఉందని గ్రామాల్లోని రైతులు వాపోతున్నారు.

జేసీఎస్ కన్వీనర్ కుటుంబాన్ని ఓదార్చిన బూచేపల్లి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి: మండలంలోని రాజంపల్లిలో జేసీఎస్ మండల కన్వీనర్ బత్తినేని వెంకటేశ్వర్లు కుటుంబాన్ని దర్శి శాసనసభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సోమవారం ఓదార్చారు. ఆయన తండ్రి దశదిన కర్మ సందర్భంగా హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

పెద్దారవీడు: మండల పరిధి చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. పేకాట అడుతున్న నలుగురి నుంచి రూ.23 వేలు స్వాధీనం చేసుకోవడంతో పాటు వారిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్, ఎస్‌బీ ఏఎస్ఐ మాల్యాద్రి తెలిపారు. అదుపులోకి తీసుకున్న నలుగురిని మార్కాపురం కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, చట్ట వ్యతిరేక పనులు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

6వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన గిరిజన బాలబాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఈశ్వర్‌సింగ్ తెలిపారు. 5వ తరగతిలో ఉత్తీర్ణులైన గిరిజన బాల బాలికలు (30 మంది బాలురు, 30 మంది బాలికలు) ఫిబ్రవరి 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దీనికి సంబంధించిన రాత పరీక్షను ఫిబ్రవరి 25వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫొటో, ఫోన్ నంబర్ అడ్రస్ తదితర వివరాలతో www.aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94160 94165 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ


సుబ్బరత్నమ్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

పెద్దదోర్నాల: మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రావిక్రింది సుబ్బారావు సతీమణి సుబ్బరత్నమ్మను యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ సోమవారం పరామర్శించారు. మండల కేంద్రంలోని సుబ్బారావు గృహానికి చేరుకున్న ఎమ్మెల్యే.. మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న సుబ్బరత్నమ్మను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య స్థితిగతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అమిరెడ్డి రామిరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, బొగ్గరపు రమేష్, లాలూనాయక్, రాంభూపాల్‌రెడ్డి, పవన్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

41 రోజులు శివస్వాములకు అన్నదానం


అన్నదానం ఏర్పాట్లలో శివస్వాములు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి పార్వతీ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో 41 రోజుల పాటు నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని గురుస్వామి పండు స్వామి ఆదివారం ప్రారంభించారు. నియమ నిష్టలతో శివదీక్షను చేపట్టే స్థానిక శివస్వాములతో పాటు ఇతర ప్రాంతాల నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి తరలి వచ్చే శివస్వాములు, భక్తుల సౌకర్యార్థం ఏటా అన్నదానం 41 రోజుల పాటు నిర్వహించటం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని భక్తులు సద్వినియోగ పరుచుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా శివ మాలాధారులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం చేశారు.

ఓటర్ల దినోత్సవంపై వ్యాసరచన పోటీలు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎన్‌వీ రమణ

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు, క్విజ్, చర్చా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ రమణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 25న జరుపుకునే జాతీయ ఓటర్ల దినోత్సవం భారత ఎన్నికల సంఘం స్థాపనను సూచిస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటే వేయటం ప్రాధాన్యం నొక్కిచెప్పడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 2011 నుంచి ఓటర్ల దినోత్సవం పౌరులను, ముఖ్యంగా యువతను ఎన్నికల ప్రక్రియలో పాల్గొనమని ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పాలనకు మూలస్తంభమైన భారత పౌరుల ఓటు హక్కులను కూడా సూచిస్తోందన్నారు. డాక్టర్ కె.ప్రభుదాసు, పొలిటికల్ సైన్సు లెక్చరర్ బీవీ రమణ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

- ఒకరికి గాయాలు

పెద్దదోర్నాల: గుర్తు తెలియని వాహనం ఢీ కొనటంతో ఓ ద్విచక్ర వాహనదారుడు గాయపడ్డాడు. ఈ సంఘటన మోట్ల మల్లికార్జునపురం సమీపంలో ఆదివారం జరిగింది. ప్రమాదంలో నంద్యాలకు చెందిన ప్రభాకర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కొర్రప్రోలు ఫీడర్ అంబులెన్స్ సిబ్బంది సతీష్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గుర్తు తెలియని వాహనం అచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.


గాయపడిన నంద్యాల వాసి ప్రభాకర్

లక్కవరం వాసికి అరుదైన ఆపరేషన్


చిన్న రామయ్యతో గుంటూరు జీజీహెచ్ వైద్యులు

తాళ్లూరు: మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన జి.చిన్న రామయ్యకు గుంటూరు ప్రభుత్వ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేశారు. రామయ్య బైకుపై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పక్కటెముకలు విరగడంతో పాటు స్టర్నల్ ఎముక విరిగి గుండెల దగ్గరకు చొచ్చుకొని రావడంతో ఊపిరి తీసుకోవడం కష్టంగా మారింది. దీంతో బంధువులు ఆయన్ను గుంటూరు జీజీహెచ్‌లో జాయిన్ చేసారు. అక్కడి వైద్యులు స్టార్నల్ ఫ్యాక్చర్‌ను స్టెబిలైజ్ చేసి ప్లేట్స్ అమర్చారు. ఆపరేషన్ అనంతరం విజయవంతంగా చేసి చిన్న రామయ్యను డిశ్చార్జ్ చేశారు. ఈ తరహా ఆపరేషన్ రాష్ట్రంలో మొదటిదని జీజీహెచ్ వైద్యులు తెలిపినట్లు ఆయన బంధువులు పేర్కొన్నారు.

60 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ గీతపద్మ

దర్శి: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంవీఐ కార్యాలయంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎంవీఐ పి.రవికుమార్ ప్రారంభించారు. దర్శి లయన్స్ క్లబ్ సహకారంతో వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంవీఐ రవికుమార్ తెలిపారు. లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్సు డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ గీతపద్మ కంటి పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ సెక్రటరీ జి.శ్రీనివాసరావు, వైస్ సెక్రటరీ ఎస్.మధు, వైస్ ప్రెసిడెంట్ స్వాములు, రవాణా శాఖ సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

పశువులతో ఆర్థిక వెసులుబాటు


నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి

యర్రగొండపాలెం: పశువులను పెంచితే వాటి ద్వారా పశుపోషకులకు ఆర్థిక వెసులుబాటు ఉంటుందని పశు వైద్యాధికారులు డి.మంత్రూనాయక్, శివారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మురారిపల్లె, అమానిగుడిపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాల్లో వారు పాల్గొని పలు సూచనలు చేశారు. ఆదాయం తెచ్చిపెట్టే మూగజీవాల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సి ఉందని, ముందు జాగ్రత్తల కింద మందులు వాడాలని సూచించారు. రెండు ప్రాంతాల్లో జరిగిన వైద్య శిబిరాల్లో 1982 జీవాలకు వారు పరీక్షలు చేశారు. అందులో 64 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. 8 పశువులకు కృత్రిమ గర్భధారణ, 8 పశువులకు గర్భ కోశవ్యాధులకు, 24 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్స చేసినట్లు వైద్యులు వివరించారు.


సైడు కాలువలు శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

తమ్మలూరులో వైద్యశిబిరం

సాక్షి ఎఫెక్ట్..

ముండ్లమూరు (దర్శి): మండలంలోని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి తమ్మలూరులో సోమవారం డాక్టర్ మధుశంకర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 'మంచంపట్టిన తమ్మలూరు' శీర్షికతో సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురించిన కథనానికి స్పందించిన వైద్యాధికారి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి సైడు కాలువలు శుభ్రం చేయించి దోమల మందు పిచికారీ చేయించారు. గ్రామంలో ఇంటింటా సర్వే చేయించి జ్వర పీడితులను గుర్తించి రక్త పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మధుశంకర్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే ఆస్పత్రికి రావాలని సూచించారు. దర్శి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్.బసవారెడ్డి, పీహెచ్‌సీ సూపర్‌వైజరు కేపీ రాజు, ఎస్. నాగేశ్వరరావు, వెంకట్రావు, ఏఎన్‌ఎం శిరీష, ఎంఎల్‌హెచ్‌పీ రాజేశ్వరి, కిరణ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


దోమల మందు స్ప్రే చేయిస్తున్న అధికారులు


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మధుశంకర్